# బజ్జీలు

—వాణిశ్రీ.

అదొక బ్యాంక్. కష్టమర్స్ ఎవరూ లేరు. బిజినెస్ అవర్స్ అయిపోయాయి.

మెయిన్‌గేటు సగం మూసివుంది. సెక్యూరిటీగార్డు స్టూలుమీద కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. పట్టపగలే మందుకొట్టి వచ్చాడేమో ?

మేనేజర్ ఇంటర్వ్యూకోసం అక్కడ పడిగాపులు పడుతున్నాడు రాజారామమోహనరావు. ఉద్యోగం రావలసిన వయసు దాటిపోయింది. ఇక మిగిలింది సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్. కోళ్ళు పెంచి, పందుల్ని మేపి బతకాలని నిశ్చయించుకుని దానికి కావలసిన పెట్టుబడి కోసం తిరుగుతున్నాడు.

బంగాళాఖాతంలో వాయుగుండం పడింది. వారం నుంచి ముసురు పట్టి వదలడంలేదు. సన్నగా చినుకులు పడుతున్నాయి. ఆకాశంలో దట్టంగా మబ్బులు పట్టి పట్టపగలే చీకటిగా వుంది.

క్యాషియర్ పరబ్రహ్మం మేనేజర్ రూమ్‌లోకి ప్రవేశించి ఒక తైరు నవ్వు నవ్వి "ఆ కుర్రాడ్ని పిలవనా?" అన్నాడు.

"ఎందుకూ?" అన్నాడు మేనేజర్ పరధ్యానంగా.

"భలేవారే! అప్పుడే మర్చిపోయారా? అతను లోన్‌కోసం అప్లికేషన్ పెట్టాడు"

"సెక్యూరిటీ సరిగ్గా లేదు. ఆఁ- అదెక్కడ శాంక్షన్ చేస్తాం?"

"చెయ్యమని ఎవరు చెప్పారు?"

"మరి?"

"వాతావరణం చూశారుగా? వారం నుంచి చస్తున్నాం ఎవడూ దొరక డంలేదు. వాడ్ని పార్టీ అరేంజ్ చెయ్యమంటాను" అన్నాడు.

ఎవరో శాపం పెట్టినట్టుగా ముసురు పట్టిన దగ్గర్నుంచి పార్టీలే తగ లడం లేదు. జేబులో డబ్బెట్టి తాగడానికి మనసొప్పక గిలగిలలాడిపోతు తున్నాడు పరబ్రహ్మం.

"పార్టీ తీసుకుంటాం బాగానే వుంది. లోన్ ఎలా శాంక్షన్ చెయ్యడం?"

"హెడ్డాఫీసుకి రాసిపారేశాం. అక్కడ పడు నీ తిప్పలు అని చెప్దాం. ఇక మన జోలికి రాడు"

పరబ్రహ్మం వంక మెచ్చుకోలుగా చూశాడు మేనేజర్.

"ఓర్నీ! మంచి ఐడియానే వేశావే! బ్యాంక్‌లో గుమాస్తాగా వుండి పోయావుగాని పాలిట్రిక్స్‌లో జేరిపోయివుంటే ఈ పాటికే రామారావుని కుర్చీదించేసేవోడివే నీ ఐడియాల్తోటి"

పరబ్రహ్మం "హి....హి....." అని నవ్వాడు.

మేనేజర్ పచ్చజెండా వూపగానే పరబ్రహ్మం పరవసించిపోయాడు. ఆయన మెచ్చుకోవడంతో గ్లాసులో పోసిన బీరులా పొంగిపోయాడు.

అతనికి అన్నం లేకపోయినా ఫరవాలేదుగాని మందుకొట్టించే పార్టీ దొరక్కపోతే మాత్రం తెగ నీరసించిపోతాడు. ఇంట్లో పప్పుదప్పళం చప్పిడికూడు, బార్‌లో అయితే చికెన్‌ఫ్రైలు, జాయింట్లూ దొరుకుతాయి మరి.

రాజారామమోహనరావుకి చలి చలిగా వుంది. వేడి వేడిగా "టీ" తాగాలనిపించింది. కాని ఈ లోపల మేనేజర్ పిలిస్తే! అని సందేహించి ఆగిపోయాడు.

మేనేజర్ తరుపున క్యాషియర్ నుంచి కాల్ వచ్చింది.

"నీ గురించి మేనేజర్‌తో మాట్లాడాను" అన్నాడు పరబ్రహ్మం.

"సార్!" అంటూ అతను వినయంగా నిల్చున్నాడు.

"ఆయన చేయగల సాయం చేస్తానన్నాడు. కాని...."

"చెప్పండి సార్!"

అబ్బే! ఆయనేం లంచాలు తినే రకం కాదు. పట్టి రూల్స్ మనిషి. రూల్సంటే ప్రాణం. కాకపోతే ఒక పార్టీయిస్తే మంచిది. నీ మేలుకోరి చెప్తున్నాను. పదివేలిచ్చినా "వుహూఁ" అనేస్తాడుగాని మందుసీసా కనబడితే మాత్రం పెంపుడు పిల్లిలా మన వెనుక నడుస్తాడు. అదాయన వీక్‌నెస్, ఒక్కొక్కడికి ఒక్కో వీక్‌నెస్. అదంతా నీ ఇష్టం బలవంతం ఏం లేదు."

"ఫర్వాలేదు సార్! పార్టీదేముంది? తప్పకుండా ఇద్దాం"

"ఓ. కే. నా?"

"ఓ. కే. సార్"

"సరే! నేనాయన్ని "బ్లూమూన్" బార్‌కి తీసుకొస్తాను. రాత్రి సరిగ్గా ఏడున్నరకి....నువ్వక్కడ రెడీగా వుండు"

"సరే సార్!" అన్నాడతను. తనకి అప్పు మంజూరై ధనలక్ష్మి ఘల్లుఘల్లుమని కౌగలించుకున్నంత సంబరం కలిగింది.

* * * *

బార్ కందిరీగల తుట్టెలా కిటకిటలాడుతోంది. వారుణి వాహిని గలగలమని గ్లాసుల్లో ప్రవహిస్తోంది. సీట్లు దొరక్క దేవదాసులు పిచ్చెక్కిపోయినట్లు అటూఇటూ తిరుగుతూ కిచెన్ రూమ్‌లోనైనా ఫరవాలేదని బతిమాలుతున్నారు.

రాజారామమోహనరావు స్పెషల్ రూమ్ బుక్ చేసి వుంచాడు కాబట్టి ఇబ్బందిలేకుండా పోయింది. టంచన్‌గా ఏడున్నరకి ఇద్దరూ వచ్చారు బార్ దగ్గరికి.

"ఇతనే సార్ రాజారామమోహనరావు"

పరిచయం చేశాడు పరబ్రహ్మాం.

అతను విష్ చేశాడు పరబ్రహ్మాం

మేనేజర్ షేక్ హేండ్ యిచ్చి "విష్‌యూ బెస్టాఫ్ లక్!" అన్నాడు. తనకి బ్యాంక్ ఋణం ఇచ్చినట్లూ, కోళ్ళు, పందులు పెంచి పెద్దపౌల్ట్రీ ప్రొప్రయిటర్‌వి కమ్మని మేనేజర్ దీవిస్తున్నాడని అతను సంతోషించి "థాంక్యూ వెరీ మచ్ సార్!" అని కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

ముగ్గురూ బార్‌లోకి ప్రవేశించారు.

బార్ లోపల డిమ్‌లైట్ల వెలుగు సగం చంద్రుడి వెన్నెల్లా మసక మసకగా ప్రసరిస్తోంది. డిస్కో మ్యూజిక్ మధుపాన ప్రియులను మ్యాజిక్ చేస్తోంది.

పరబ్రహ్మాం హాఫ్ బాటిల్ మెక్‌డోవల్ విస్కీకి ఆర్డర్ యిచ్చాడు.

"సార్‌కి ఫేవరెట్ విస్కీ !" అంటూ మేనేజర్‌వైపు చూసి తైరు నవ్వు నవ్వాడు.

మూడో గ్లాసులో పోస్తుంటే అతను అభ్యంతరం చెప్పాడు.

"ఫరవాలేదు ఒక పెగ్గు పుచ్చుకో! మాకందరకూ మొదట్నుంచీ అలవాటుందా? మొదలంటూ పెడితే అదే అలవాటవుతుంది?" అని పర బ్రహ్మాం బలవంతం చేశాడుగాని అతనొక కూల్‌డ్రింక్ తెప్పించుకున్నాడు.

"కుర్రాడ్ని బలవంత పెట్టకు. ముందు ముందు బిజినెస్‌లోపడ్డాక నేర్చుకుంటాడ్లే" అని వారించాడు మేనేజర్.

జింజర్ చికెన్, చిల్లీ చికెన్, చికెన్ జాయింటూ అంటూ ఆర్డర్లు యిచ్చి లాగిస్తున్నారు ఇద్దరూ.

పరబ్రహ్మాం తాగుడు, తిండి చూస్తుంటే అతని కళ్ళు తిరుగు తున్నాయి. చూడ్డానికి గెడకర్రలా, ఆర్నెల్లనుంచి అన్నం లేని వాడిలా కన్పించే బక్కవెధవ పొట్టలో ఇంత చోటెలా వుంది ?

హాఫ్ బాటిల్ అయిపోయింది.

మరొక హాఫ్ బాటిల్ టేబుల్ మీద అలంకరించింది.

అతని గుండె దడదడ లాడుతోంది. జేబులో మూడొందల పరకా వున్నాయి. వీళ్ళ తాగుడు, తిండీ చూస్తుంటే జేబులో డబ్బులు చాలక వాచీ, చొక్కాలు తాకట్టు పెట్టాలేమో అని అనుమానం మొలకెత్తుతోంది.

ఇంకాసేపుఆగితే అక్కడ తినడానికేమీ రెడీగా లేకపోతే గ్లాసులు, ప్లేటులు గూడా కరకరనమిలి మ్రింగేసేంత ఆత్రంగా తింటున్నారు.

అలా ఎంతసేపు కుర్చీల్లో మేకులు దిగ్గొట్టుకుని వుంటారో? ఇంత తాగీ తినీ లోన్ ఇస్తారాలేదా? అసలే నిరుద్యోగం, అప్పుల్లో అప్పుచేసి వీళ్ళ బొందని పెట్టడం.

గోదావరి వరదలో కొట్టుకుపోతున్నవాడి కాళ్ళకి పాము చుట్టుకున్నట్టు వుక్కిరి బిక్కిరై పోతున్నాడు.

తాగుడు మొదలుపెట్టి రెండు గంటలు దాటుతోంది. అలవాటు లేని వాసనకి కడుపులో తిప్పుతోంది. ఇంకాసేపు అక్కడే కూర్చుంటే చిన్నప్పుడు తాగిన ఆముదంతో సహా వాంతి అయ్యేటట్లున్నది.

"ఓయ్। పరబ్రహ్మం! ఈ టైమ్‌లో వేడివేడి మిరపకాయ బజ్జీలుంటే భలేమజాగావుంటుంది." మత్తుగా అన్నాడు మేనేజర్.

"దానికేపుంది సార్! తెప్పిద్దాం!" అని

"డజను మిరపకాయ బజ్జీలు వేడివేడిగా వుండాలి!" ఆర్డర్ వేశాడు

"బజ్జీలు లేవు సార్!" అన్నాడు స్టీవర్డ్.

"ఎందుకు లేవు?"

"ఇక్కడ వుండవుసార్!"

పోనీ బైటనుంచి తెప్పించు"

"సారీ సార్!"

"అదేంటి తికమక? మీ దగ్గర లేవు బైటనుంచి తెప్పించవు. ఇదేం బార్? పిలు మీ ప్రొప్రయిటర్ని "పరబ్రహ్మం వూపుగా కంఠం పెంచాడు.

రాజారామ మోహనరావు పరిస్థితి స్మృతిమించుతున్నదని గ్రహించి "మీరు వూరుకోండిసార్! బజ్జీలు నేను తెప్పిస్తాగా!" అని పరబ్రహ్మాన్ని శాంతపరచి తనులేచి వెళ్ళాడు.

బార్ బైటకు వెళ్ళి వీధి చివర తోపుడు బండి దగ్గరకు వెళ్ళాడు.

"ఏం కావాలి సార్?" అని అడిగాడు బండి అతను.

"డజను మిరపకాయ బజ్జీలు"

బండి అతను బజ్జీలు ప్యాక్ చెయ్యడానికి తీసిన కాగితం మీద అక్షరాలు రాజారామ మోహనరావుని ఆకట్టుకున్నాయి. అక్షరాలా అవి తన అక్షరాలే. సంతకం కూడా తనదే!"

"అరె....రె....!" అని అతను ఆశ్చర్యపోతూ ఆ కాగితం తన చేతుల్లోకి తీసుకున్నాడు.

తల తిరిగినట్లయింది. అది తను బ్యాంక్ లోన్ కోసం పెట్టిన అప్లికేషన్, బజ్జీల బండి మీదకు ఎలా కొట్టుకొచ్చింది?

"ఇప్పుడే వస్తా!" అని బండివాడితో చెప్పి చరచర బయటికి వెళ్ళాడు.

"తెచ్చావా అని అడిగాడు పరబ్రహ్మం.

"వస్తున్నాయిలే,ఇంతకీ నా లోన్ అప్లికేషన్?" అని అతను అంటూ వుండగానే పరబ్రహ్మం అర్థోక్తిలో అందుకున్నాడు.

"నీ అప్లికేషన్ ఫైల్లోంచి తీసి మేనేజర్‌గారి టేబుల్ మీద పెట్టాను. యూడోంట్ వర్రీ!"

"మేనేజర్ టేబుల్ మీద పెట్టావా ? దొంగనాకొడకా? మరి ఇదేం టిరా?" అని బజ్జీలకొట్లోతెచ్చిన అప్లికేషన్ బల్లమీద పరిచాడు.

పరబ్రహ్మం వి త్తరపోయి కాగితంపంక చూశాడు. చూశాక గుండె

డీజల్ ఇంజన్‌లా దడదడ కొట్టుకుంది. తల మీద పిడుగుపడిన తాటిచెట్టులా గజగజవణికి పోయాడు.

మేనేజర్‌కి కళ్ళు బైర్లుకమ్మి అక్షరాలు కనిపించడం లేదు.

రాజారామమోహనరావు ప్రభంజనంలా విరుచుకుపడి బూతులు తిడుతూ "....కొడకల్లారా! పెట్టిన అప్లికేషన్లు చిత్తూకాగితాల వాళ్ళకి అమ్ము కుని పైగా లోన్లు ఇప్పిస్తామని పార్టీలు తీసుకుంటారా! ఈవాళ మీ అంతు తేలుస్తాను...." అని ఇద్దర్నీ చొక్కాలు పట్టుకుని పైకిలేపాడు.

స్పెషల్ రూమ్‌లో దీపావళి బాంబులు ప్రేలినట్లు. పిడుగులు పడు తున్నట్లు శబ్దాలొచ్చి బార్లోవాళ్ళు హడిలిపోయారు.

చెక్క టేబులు దెబ్బకి విరిగి గ్లాసులు, సీసాలు, పింగాణీ ప్లేట్లు టపటప పేలిపోయాయి.

మేనేజర్, క్యాషియరూ కిందపడి "అయ్యో!....బాబో! దేవుడోయ్! రాముడోయ్!" అంటూ మూలుగుతున్నారు.

ఈ గొడవ చూసి బార్ స్టాఫ్,తాగడం మానేసి దేవదాసులు తమాషా చూస్తున్నారు.

ట్యూబ్‌లైట్లు వెలిగాయి.

"చూడండి సార్ ! ఈ నా కొడుకులు చేసిన లుచ్ఛాపని" అని తనకు జరిగిన అన్యాయం చెప్పి, అప్లికేషను చూపించాడు అతను.

"ఆ గొడవేదో బైట చూసుకో! ఇక్కడ న్యూసెన్స్ చెయ్యకు పోలీసుల్ని పిలవాల్సొస్తుంది!" అన్నాడు బార్ మేనేజర్ రాజారామ మోహనరావుతో.

"పిలవండి సార్ పోలీసుల్ని!....వాళ్ళనే తేల్చనివ్వండి వీళ్ళ సం గతి. ఇప్పటిదాకా ఈ రాస్కెల్సు తాగినదానికి నేను చస్తే బిల్లు ఇవ్వను అన్నాడతను కోపంతో ఊగిపోతూ.

"పోలీసులు వద్దుబాబో!" అని మేనేజర్ క్యాషియరు కేకలు పెట్టారు.

"ఆ బిల్లు మేమే ఇచ్చుకుంటాం" అని బతిమాలుకున్నారు. జేబులో డబ్బులేదు. అందాకా పరబ్రహ్మం బంగారు వుంగరం హామీగా ఇచ్చాడు.

అప్పటికే వాళ్ళ ఆకారాలు పూర్తిగా మారిపోయాయి. ఆఖరిసీన్‌లో హీరోచేతిలో తన్నులుతిన్న విలన్స్‌లా పచ్చడై పోయి వున్నారు. వాళ్ళ ముఖాలు పెనంమీద పెసరట్లుల్లా మాడిపోయాయి. బట్టలు చినిగి పీలికలై చూసేవాళ్ళకి పగటివేషగాళ్ళలా కనిపిస్తున్నారు.

ముగ్గుర్నీ బార్‌బైటకు పంపేసరికి స్టాఫ్‌కి తల ప్రాణం తోకకి వచ్చింది.

"మీరు అనవసరంగా మిరపకాయ బజ్జీలు అడిగి అంతా న్యూసెన్స్ చేశారు. వెధవ బజ్జీలు....బజ్జీలని" రుసరుసలాడాడు పరబ్రహ్మం.

మేనేజర్ నోరుకాలిన పిల్లిలా అడుగులో అడుగేసుకుంటూ బయల్దేరాడు.

బ్యాక్‌గ్రౌండ్‌లో నేపథ్యంలా రాజారామమోహన్‌రావు పేల్తున్న బూతులు వినిపిస్తున్నాయి కర్ణకఠోరంగా.

ఇక వాళ్ళ కథకి తెరపడినట్లుగా తెరలు తెరలుగా మొదలైంది వాన.

(ప్రచురణ : స్వాతి వారపత్రిక, - 29-5-87.)

....o....